# గుండె గొంతులో కొట్లాడతాది

"సా..రీ..గా..మా...పా..దా..నీ...సా..." పక్కింటి పిల్లలిద్దరు వరండాలో కూర్చుని సంగీతం సాధన చేస్తున్నారు.

"దిక్కులు చూస్తున్నావేం..అక్కతో పాటు పాడూ.." మాటలు వినిపించాయి.

"పాడుతున్నానమ్మా.."

వారంలో రెండు రోజులు సాయంత్రాల్లో వాళ్ళు సంగీత సాధన చేస్తుంటారు.

రాధకు వంటగదిలోకి పిల్లల సాధన స్పష్టంగా వినిపిస్తోంది. తను కూడా వంట చేస్తూ తనకు తెలీకుండానే వారితోపాటు మెల్లిగా "సా..రీ..గా..మా..పా..దా..నీ..సా.." అంటూ పాడుతోంది.

రాధ భర్త గోపాల్‌కు ఉద్యోగం రావడంతో ఇద్దరూ పట్టణం వచ్చి రెండేళ్లవుతోంది.

పక్కింటి పిల్లల నాన్న డ్యూటీనుంచి వచ్చినట్టున్నాడు. అతని మాటలు వినిపిస్తున్నాయి. పిల్లలు కూడా మాట్లాడుతున్నారు.

రాధ ఆలోచనల్లో పడిపోయింది. ఆలోచనల్లోంచి అలా..అలా..చాలా ఏళ్ల వెనక్కు వెళ్ళిపోయింది.

"రాదా రాలేదాక్కా.." అడిగింది ఇంట్లోనించే శాంతమ్మ.

"వస్తాది..వాళ్ళ పాపకు నీళ్లు పోస్తాన్నింది. బడికి అంపిచ్చేసి వస్తాదంట" బదులిచ్చింది రాజమ్మ.

తుండుగుడ్డ ఒకటి భుజాన వేసుకుని వీధిలోకి వచ్చింది శాంతమ్మ.

"రాద వస్తే..నులుగులు బాగా పాడతాది.. ఒళ్ళు అలుపు లేకుండా ఉంటాది" అంది శ్రీదేవి.

"నువ్వూ పాడుమ్మే.." అంది గోవిందమ్మ.

"ఆయమ్మికి నులుగులురావు, అలుగులు వచ్చు" అంది శాంతమ్మ నవ్వుతా.

"ఎలబారండమ్మా..పొద్దెక్కతాండ్లా" తొందర చేసింది రాజమ్మ.

రాజమ్మ వాళ్ల వరిమడిలో కలుపు తీయడానికి ఆరుమంది ఆడవాళ్లు బయలు దేరారు.

అందరూ పోయి పావడాలు ఎగచెక్కి మునాలు పట్టుకుని కలుపు తీయడం మొదలు పెట్టారు. బార దూరం కూడా కలుపు తీయకముందే రాధ వచ్చింది. వాళ్లతోపాటు కయ్యిలో వంగి కలుపు తీయడం మొదలు పెట్టింది.

చల్లటిగాలి వీస్తోంది..

బురదమడిలోనించీ వాసన గమ్మత్తుగా ఉంది..

కయ్య పక్కన మోటారులోంచి నీళ్ళు దుంకుతున్న చప్పుడు..

ఎండ ఉన్నా సగిచ్చినట్టుంది..

"అప్పుట్నించీ నీ కోసరమే కాసుకోనుండాం తల్లా..ఒక నులుగెత్తుకో" అంది శాంతమ్మ.

"పాటలమ్మి..వచ్చింది.. ఇంగ పని యాస్ట తెలదులే" అంది రాజమ్మ.

"మీరెవరన్నా పాడండిక్కా"

"మాకు వచ్చేటిగా ఉంటే నిన్నెందుకు అడుక్కుంటాం. వంత పాడేవాళ్లమేగానీ సొంతంగా పాడలేమమ్మా.." అంది శ్రీదేవి.

"ఓరాస గుమ్మడీలో..

గుడిసెపైనా కోడీ కూసే..ఓరాస గుమ్మడీలో

పెట్టకోడి పిల్లలట్ల...ఓరాస గుమ్మడీలో

గూట్లో యేసి సర్దినాది..ఓరాస గుమ్మడీలో" రాధ పాడ్డం మొదలు పెట్టింది. ఆమెకు మిగిలిన వారందరూ వంత పాడుతున్నారు.

ఆ పాట అయిపోయింది.

"కలిగిరి కలింగర సెట్టు

కల్లేతాగబోయి ముల్లే దొక్కేను

పాతకడపా వరిమళ్లల్లో

పాట పాడుదునా ఓ ఒదినా

కలుపు దీయుదునా

పాట పాడుదునా ఓ ఒదినా..పప్పే రుబ్బుదునా" రాధ మరోపాట మొదలు పెట్టింది.

పాట అయిపోతూనే పాట..పాట అయిపోతూనే పాట..అన్నానికి తప్ప పాటా పనీ ఆగింది లేదు..అలుపూ సొలుపూ లేదు..పాటా..పనీ.. పనీ..పాటా..

పొద్దు పడమర గూట్లో వాలింది.

కయ్యిలో కలుపు తీయడం ఆపి అందరూ గట్టెక్కినారు. మోటారు దగ్గర కాళ్ళు చేతులు కడుక్కున్నారు. ఇంటి దారి పట్టినారు.

"యిన్ని పాటలు ఎప్పుడు నేర్చుకున్నావు రాదా" అడిగింది శాంతమ్మ.

"ఎప్పుడేముందాదికా..వూహ వచ్చినకాన్నించి పాటలు పాడతానే ఉండా. ఒగసారి ఇంటే చాలు..పాట వచ్చేసేది.. పాటలుపాడిపాడి..నిద్రలో లేపి ఫలానా పాట పాడుమ్మే అన్నా..పాడేస్తా తప్పోకుండా" బదులిచ్చింది రాధ.

"చదువుకున్నోళ్లకు పాటలు ఎందుకు రావులే" అంది గోవిందమ్మ.

"చదువుకున్నోళ్ళకంతా పాటలు వస్తాయా..మనూర్లో రేఖ పీలేరు కాలేజీకి పోయి చదువుకుంటాందే..పద్యం చెప్పమ్మా అన్నే నాకు రాదు అంటాండ్లా..దేనికైనా అక్కరుండాల.." అంది శాంతమ్మ.

"నువ్వు చదువుకోలేదాక్కా.." అడిగింది శ్రీదేవి.

"ఇంటికి పెద్ద కూతుర్ని కదా..నాకంటే చిన్న పిల్లోల్లను చూసుకోవద్దా..నాలుగో తరగతి సగంలో ఆపేసినారు" నవ్వుతా బదులిచ్చింది రాధ.

"అమా..అమా.." అంటా పరుగున వచ్చారు పల్లవి, వాణి.

"ఎందుకట్లరుస్తారు..పుస్తకాలు పక్కన పెట్టి గుడ్డలు మార్చుకోని ముఖాలు కడుక్కోండి" విసుగ్గా అంది రాధ.

వంట చేసేసి, ఇంటి ముందు కసువూడ్చి, నీళ్ళు చల్లుతోంది.

పల్లవి ఎనిమిదో తరగతి, వాణి ఐదో తరగతి చదువుతున్నారు. అంతకు ముందు వరకూ చిత్తూరు జిల్లాలోని ఓ పల్లెలో నానమ్మతోపాటు ఉండి చదువుకునే వాళ్ళు. అమ్మానాన్న ఉంటున్న పట్టణానికి వచ్చి రెండువారాలవుతోంది.

ఇద్దరూ ఇంట్లోకి పోయి ముఖం కడుక్కున్నారు. బట్టలు మార్చుకుంటూ ఉండగా తిరిగి పక్కింటిలోంచి సంగీత సాధన మొదలయింది.

ఇంటి ముందు ముగ్గు వేసి ఇంట్లోకి వచ్చింది రాధ.

"అమా..అమా.. మేం కూడా ఆ పాటలు పాడేది నేర్చుకుంటాంమా.." అడిగారు పిల్లలిద్దరూ.

"పాటలూ వద్దు, గీటలూ వద్దు. నోర్మూసుకుని బడి వదలతానే ప్రయివేటుకు పోండి. అక్కించి ఇంటికొస్తానే చదువుకోండి" కోపంగా అంది రాధ.

"అమా..అమా..పోతాంమా.."

"బరగ తీసుకున్నేనంటే ఈపులు వాతలు తేలతాయి. వద్దని ఒకసారి చెప్తే తలకెక్కదా?" మరింత కోపంగా అంది రాధ.

సంగీత సాధనకు వద్దన్నందుకు కోపంగా వెళ్లి పడకగదిలో అలిగి పడుకున్నారు అక్కాచెల్లెలు.

ఆరోజు ఆదివారం. వరండాలో బియ్యం కుమ్మరించి కూర్చుని మట్టి పెళ్లలు ఏరుతోంది రాధ. గోపాల్ పడక గదిలో నిద్రపోతున్నాడు. పల్లవి, వాణి హాల్లో టివి చూస్తున్నారు. వర్షాకాలం కావడంతో మధ్యాహ్నం మూడు గంటలకే ఎండ తగ్గు ముఖం పట్టింది.

ఇంటికి ఇరవై గజాల దూరంలో ఉన్న ఖాళీ స్థలంలోంచి పిల్లల అరుపులు వినిపిస్తున్నాయి. కాలనీలో ఉండే దాదాపు అందరు అబ్బాయిలు అక్కడ చేరి ఆడుకుంటున్నారు. రాధకు అప్పుడప్పుడు ఆడుకుంటున్న పిల్లల అరుపులు వినిపిస్తున్నాయి.

ఇంతలో ఒక బంతి వచ్చి ఇంటి ముందు పడి, ఎగిరి రాధ ముందున్న బియ్యంలో పడింది. ఉలికి పాటుగా తలెత్తి చూసింది రాధ.

ఇద్దరు పిల్లలు బంతితోపాటు పరిగెత్తుతూ వచ్చారు.

"సారీ అంటీ..బాల్" అంటూ ప్రహరీ గోడదగ్గరే నిల్చున్నారు.

రాధ బంతిని వారివైపు విసరి వేసింది.

బంతిని పట్టుకుని "థాంక్స్ ఆంటీ" అని పరుగులు తీసారు వాళ్ళు.

రాధ తనలో తనే నవ్వుకుంది. తిరిగి మట్టిపెళ్లలు ఏరే పని మొదలు పెట్టింది. అయితే ఇప్పుడామెను తన ఆటల జ్ఞాపకాలు వెంటాడుతున్నాయి. అలా..అలా..చాలా సంవత్సరాల వెనక్కు వెళ్ళిపోయింది.

కిలాకిలా నవ్వులు..

జానపద గీతాలు..

ఆటల అరుపులు..

సందడిసందడిగా ఉంది.. పండుగలా ఉంది...

"పెండ్లయ్యి బిడ్డ పుట్టినా.., రాద చిన్నపిల్ల మాదిరిగా పరిగెత్తా ఉండాదే"

"రెట్ట లావుగూడాలేదు, హుషారులేక యాడికి పోతాది?"

"లావుదేముండాదిలే.. రాద పుట్టగోసి పెట్టి అల్లిలోకి దిగితే మొగోడు కూడా ఆయమ్మి ముందర పనికిరాడు.., బల్గుడు ఆడేదానికి"

వీధిలో ఉప్పరపట్టె ఆడుతున్నారు. ఊరు ఊరంతా అక్కడే ఉంది.

అటు పది మంది, ఇటు పదిమంది ఉన్నారు. ఉప్పు తెచ్చే వైపు రాధ ఉంది.

"రాదను వదలద్దుమే సుగుణా. కొంచెం ఏమారినావంటే ఆ పక్క ఎల్లిపోయి ఉప్పు తెచ్చేస్తాది." పెద్దాబద్ది అరిచి చెప్పినాడు.

"నేనెందుకు వదులుతా..నాకేం తెలీదా.."సుగుణ నవ్వుతా బదులిచ్చింది.

"రాదను ఆపేదానికి ఎవురినింటీ కాదు.. ఆయమ్మి గుంపించింది మొదులుపెట్టిందంటే కాళ్లనొప్పి వచ్చి కింద పడతావు నువ్వు" చూస్తున్న వాళ్ళలో ఒక పెద్దావిడ అంది.

సుగుణకు రోషం వచ్చింది. "ఏదీ గుంపిచ్చమను చూద్దాం" అంది.

వాళ్ళతో మాటల్లో పడి కొంచెం ఏమరుపాటుగా ఉండంగానే రాధ అటువైపు దాటేసింది. చూసేవాళ్లంతా పకపకా నవ్వారు.

అర్ధరాత్రి కావస్తా ఉంది. మొలకలపున్నమి నెల. పున్నమికి ఇంక రెండు రోజులే ఉండటంతో వెన్నల పగల్లా ఉంది. దాదాపు ఆ నెలంతా ఆటపాటలతో రాత్రిళ్ళు గడపడం అందరికీ అలవాటు. పున్నమిరోజు ఊరును అనుకుని ఉండే ఊడగలమ్మ దేవతకు తిరణాల చేస్తారు. ఆ తిరణాల కోసం ఎక్కడుండే బంధువులందరూ ఊరికి వస్తారు. బయట ఊర్లల్లో ఇచ్చిండే ఆడబిడ్డలందరూ వస్తారు. రాధ అమ్మగారింటికి వచ్చి రెండు రోజులయింది. వచ్చిన రోజునుంచి రాత్రుల్లో ఆటలే ఆటలు.

"ఎట్ల చేసేదమ్మా ఈ బిడ్డతో..పెండ్లయ్యి బిడ్డయినా ఇంగా చిన్నపిల్ల మాదిర్తో ఎగరాలంటాదే..మ్మేయ్..రాదా..బిడ్డ ఏడస్తాండాది..మీ ఆయన పడుకోనుండాడు..రామ్మే ఇంటికి" అరస్తా వచ్చింది లక్ష్మమ్మ.

"ఉండమ్మా..వస్తాను" అంది రాధ.

"బిడ్డ ఏడస్తాందాదంట పోమ్మే" ఒక పెద్దావిడ అంది.

"ఇప్పుడే వస్తా.." అంటూ ఇంటి వైపు పరిగెత్తింది రాధ.

నిజంగానే ఇంటికి పోయేప్పటికి ఏడాదిన్నర వయసున్న పల్లవి ఏడుస్తోంది. నిద్ర కళ్లతో ఒడిలో పెట్టుకుని ఏడుపు మానిపించే ప్రయత్నం చేస్తున్నాడు గోపాల్.

"ఏంబా..అయిపాయనా ఆటలు..మద్దెమద్దలో వచ్చి బిడ్డకు పాలిచ్చి పోతేఏమి?" అసహనంగా అన్నాడు.

పల్లవిని తీసి ఒడిలో పడుకోబెట్టుకుని పాలిస్తూ "పాప ఏడిస్తే, అమ్మనొచ్చి చెప్పమన్నే. నీకు నిద్ర రాలేదా?" అంది రాధ.

"నిద్రపోయిన్నా..పాప ఏడ్చాలకు మెలకువ వచ్చింది." అన్నాడు పడుకుంటూ గోపాల్.

అతను ఆరోజే సాయంత్రం వచ్చాడు.

ఇంతలో లయగా చప్పట్లు వినిపించాయి.

కాసేపట్లో "పద్దన్నే లేసినాడు కాదరయ్యా

కాల్లు మొగం కడిగినాడు కాదరయ్యా

కాల్లుమొగం కడిగినాడు కాదరయ్యా

వంగనామం పీకినాడు కాదరయ్యా

సద్దిసంగటి తిన్నాడు కాదరయ్యా" పాట వినిపిస్తోంది. ఒకరు పాడుతున్నారు. వెనకంటీ మిగిలినందరూ వంత పాడుతున్నారు.

"జక్కీక ఏస్తాందారు. పాపను తట్టు.. నిద్ర పోతాది" అంటూ భర్త పక్కన పాపను పడుకోబెట్టి తిరిగి వీధిలోకి పరుగు తీసింది రాధ.

తను వెళ్లేప్పటికి సుమారు నలబభైమంది ఆడామగా కలిసి జక్కీక వేస్తున్నారు.

"మ్మేయ్ రత్నా..నువ్వు పక్కకు రా.. తప్పట్లు తప్పేస్తాందావు. నువ్వెందుకో రాదా" అందొకామె.

రత్న పక్కకు వచ్చేసింది. అక్కడ రాధ చేరి చప్పట్లు వేయడం మొదలు పెట్టింది.

"పాటపాడు రాదా" అంది ఒకామె.

"ఈ పక్కకు రా గోపాలా..ఈడ కుచ్చుందువు. ఈ ఊరల్లునివి..నిల్చుకుంటే ఏం బాగుంటాది" పిలిచారు చుట్టూచూస్తున్న వాళ్ళలో ఒకతను.

గోపాల్ పల్లవిని భుజాన వేసుకుని పోయి వాళ్ళపక్కన కూర్చున్నాడు.

"అమ్మా..మేం ఆడుకోను పోతాం" అన్నారు పల్లవి, వాణి. కరెంటు పోవడంతో ఇద్దరూ వరండాలోకి వచ్చారు.

సరిగా విన్నట్టు లేదు "యాడికీ.." అడిగింది రాధ.

"రేప్పు మాకు స్కూల్లో ఖోఖో పోటీలుండాయి. ఆపక్కన ఉండారే.., జ్యోత్స్న, గీత, రాణి, మాధవి అంతా ఆడుకుంటా ఉంటారు. మేం కూడా పోతాం" అంది పల్లవి.

పల్లవి పదవ తరగతి చదువుతోంది. వాణి ఏడో తరగతి చదువుతోంది.

"ఆటలొద్దు ఏమొద్దు.. ఇంట్లోకి పోండి" అరచినట్టుగా అంది రాధ.

"ప్లీజ్‌మా..నన్ను పంపకపోతే పోనీలే..అక్కను పంపమ్మా..స్కూల్లో అందరికన్నా ఫస్ట్ అక్క ప్రాక్టీస్ చేయనీ" అంది వేడుకోలుగా వాణి.

"ఇంగోసారి నాదగ్గర ఆటల మాట ఎత్తినారంటే గూబగుయ్ మంటాది. నోర్మూసుకోని చదువుకోండి. ఇద్దరికీ ఈ సమచ్చరం పబ్లిక్ పరీక్షలు కదా" అంది పిల్లల వైపు ఉరిమి చూస్తూ రాధ.

"ప్లీజ్‌మా.." ఇద్దరూ ఖాళీస్థలంలో ఆడుకుంటున్న పిల్లలను చూస్తూ అక్కడే నిల్చున్నారు.

"గాడిదలు మాదిరిగా పెరిగిండారే. ఒగసారి చెప్తే అర్థం కాదా..? పోండి గమ్మున" అరచినట్టుగా అంది రాధ.

"ఆట్లాడుకోనీవు, పాటలు పాడుకోనీవు..ఎప్పుడూ ఇంతే.." ఏడుస్తూ ఇంట్లోకి పోయారు పల్లవి, వాణి.

రాధ అరుపులకు పడక గదిలోంచి బయటకు వచ్చిన గోపాల్ "ఎందుకు ఏడస్తాండారే బిడ్డలు" అడిగాడు భార్యను.

"పిల్లోల్లకు వయసు పెరగతాందేగానీ బుద్ధి పెరగడంలే..ఇద్దరికీ ఈ సారి పబ్లిక్ పరీక్షలు గదా. బాగా చదువుకోని పాసవుదామని లేకుండా, ఆడుకోను పోతారంట. ఆటలు వద్దనిందానికి ఏడుస్తాండారు" ఎవురో కొట్టినట్టు విసురుగా సమాధానం చెప్పింది రాధ.

ఔనా అన్నట్టు తల వూపి మౌనంగా ఉండిపోయాడు గోపాల్. అక్కడే నిలబడుకుని ఖాళీ స్థలంలో ఆడుకుంటున్న పిల్లలను చూస్తున్నాడు. తండ్రి తమవైపు మాట్లాడతాడేమో అని ఆశగా ఉన్న పల్లవి, వాణి అతను ఏమీ మాట్లాడక పోయేసరికి మరింత బాధకు గురయ్యారు.

"ఏం చేస్తున్నారండీ.." అంటూ వచ్చింది రెండిళ్ళ అవతల ఇంటిలో ఉన్న వనజ, తన ఆరేళ్ళ బాబుతో కలిసి.

"రండి..రండి..కూర్చోండి..కూరలోకి మసాలా చూసుకుంటాండా" అంది రాధ.

"మా అబ్బాయి ప్లెడ్జ్ నేర్చుకున్నాడండీ..అది అందరికీ వినిపిస్తున్నాడు. మీకూ వినిపించాలంటే తీసుకొచ్చా.." అందామె నవ్వుతూ.

"ఔనా చిన్నా..కూర్చోండి" అంది రాధ.

వనజ కుర్చీలో కూర్చుంది. ఆమె ఒడిలో కూర్చున్నాడు పిల్లాడు.

"ఏదీ చెప్పరా..ఇంతవరకూ ఇంట్లో ఆంటీకి చెప్తా చెప్తా.. అన్నావే..చెప్పు మరి" అంది వనజ.

పిల్లాడు సిగ్గుగా తల దించుకున్నాడు.

"చెప్పమ్మా..వింటాను" అంది రాధ.

పడకగదిలో చదువుకుంటున్న అక్కా చెల్లెలు హాల్లోకి వచ్చి నిల్చున్నారు.

కాసేపు ఇద్దరూ అడుక్కున్నాక "ఇండియా ఈజ్ మై కంట్రీ..ఆల్ ఇండియన్స్ ఆర్ మై బ్రదర్స్ అండ్ సిస్టర్స్.." అంటూ గడగడా పాఠం అప్పచెప్పినట్టు చెప్పేశాడు వాడు.

పల్లవి, వాణి చప్పట్లు కొట్టి "బాగా చెప్పావ్" అన్నారు.

శభాష్ అన్నట్టుగా తల ఊపింది రాధ.

"వస్తానండీ..పనుంది.." తన కొడుకును తీసుకుని వెళ్ళిపోయింది వనజ.

"మీరుపోయి చదువుకోపోండి" అంది రాధ.

"అమ్మా..ప్లెడ్జ్ చెప్పినందుకు వాడిని మెచ్చుకున్నావే..మేమేదన్నా నేర్చుకుని స్కూల్లో స్పీచ్ ఇస్తామంటే వద్దంటావెందుకు?" ప్రశ్నించింది పల్లవి.

"వాడంటే పిల్లోడు. మీరేమన్నా పిల్లోళ్లా..చదువుకోపోండి గమ్మున" అంది రాధ.

"ఎప్పుడూ చదువేనా..కొంచెపు కూడా ఆటపాటలుండవా? ఎలక్యూషన్ కాంపిటీషన్, ఎస్సే రైటింగ్, ఆటలపోటీలు ప్రతి సంవత్సరం స్కూల్లో పెడతాండారు. ప్రైజలు వచ్చినోళ్ళు స్టేజి ఎక్కి తీసుకుంటాంటే నాకయితే ఏడుపు వస్తాది. వాళ్లకన్నా నేను బాగా ఆడగలను, మాట్లాడగలను, పాడగలను...నీవళ్ళే దేంట్లో పార్టిసిపేట్ చెయ్యడం లేదు." బాధగా అంది పల్లవి.

"ఆటలేమన్నా కూడు పెడతాయా.., గుడ్డ .పెడతాయా..నాలుగక్షరాలు నేర్చుకుంటే ఏదో ఒక ఉద్యోగమొస్తాది..బాగా బతుక్కోవచ్చు..నలుగురిలో పేరొస్తాది" నచ్చచెబుతున్నట్టుగా అంది రాధ.

"ఆటపాటల్లో పాల్గొంటా బాగా చదువుకొని ఉద్యోగాలొచ్చినోళ్లుండారుమా"అంది వాణి.

"ఆటల్లో నేషనల్ లెవల్లో ఆడితే ఉద్యోగాల్లో వాళ్లకు ఇంపార్టెన్స్ ఇస్తారంట. మా టీచర్ చెప్పింది. నేషనల్ లెవల్లో ఆడాలంటే ముందు వీధిలో ఆడాల కదా" అంది పల్లవి.

"నాకయ్యన్నీ ఏం చెప్పద్దండీ.. బుద్ధిగా చదువుకోండంతే" మొండిగా చెప్పింది రాధ.

"చుట్టూ అందరినీ చూస్తాండావు కదామ్మా..మా మాదిరిగా బడీ, ఇల్లూ అని ఎవరన్నా పిల్లలు క్వార్టర్స్‌లో ఉండారా?అమ్మాయిలందరూ సంగీతం క్లాస్‌కో, డ్యాన్స్ క్లాస్‌కో పోతాండారు. కొందరు ఖోఖో, షటిల్ ఆడతాంటారు. అబ్బాయిలయితే చెప్పాల్సిన పనేలేదు. ఎంతసేపూ ఆడుకునే పనే. మమ్మల్ను మాత్రం ఎందుకు జైల్లో మాదిరిగా గడప దాటి బయటకు పోనివ్వడం లేదు" నిలదీసింది పల్లవి.

రాధ ముఖంలో కంగారు కనిపించింది. సమాధానం చెప్పకుండా తలదించుకుని ఉండి పోయింది.

"చెప్పమ్మా..మమ్మల్ను ఎందుకు ఆడుకోనీవు, ఎవ్వరితోనూ ఎందుకు కలవనీవు.. సమాధానం చెప్పేంత వరకూ మేం చదువుకోం" అని అక్కడే కూర్చున్నారు అక్కాచెల్లెలు.

కూతుళ్ళ ప్రశ్నలు సంధించే కొద్దీ రాధ మనసు వెనక్కు వెనక్కు వెళుతోంది. తాను తొలిసారిగా పట్టణం వచ్చినప్పటి సంగతులు, తన పిల్లలు పట్టణం వచ్చినప్పటి సంగతులు గుర్తుకు రాసాగాయి.

"ఓరిమగడా వయ్యారి మగడా.. నా ఏలు పడే పాటు చూడు ఓరి మగడా" జానపద గేయం మెల్లగా పాడుకుంటూ వచ్చి పక్కింటి తలుపు తట్టి "అక్కా ఓక్కా.." పిలిచింది రాధ.

"ఎవరండీ.." ఇంట్లోనించీ వచ్చింది అనసూయ.

"తాగేనీళ్ళు యాడొస్తాయికా"

"ఏంటీ..!" అర్థం కానట్టు అడిగిందామె.

చేత్తో సైగ చేస్తూ "తాగే నీళ్ళు యాడొస్తాయి" అడిగింది రాధ.

రాగిరంగులో ఉన్న వంకీల జుత్తులో బంతిపూవు.. చామనచాయలో దేహం.. నీలం రంగులో ముతకచీర.. రెండు చేతులకు దజను దజను మట్టిగాజులు.. నుదుటన అర్ధరూపాయి బిళ్ళంత కుంకుమబొట్టు.. మెడలో పసుపుదారం..చెప్పుల్లేని కాళ్ళు..

రాధను పరిశీలగా చూసి "ఏవూరండీ మీది.." అడిగింది అనసూయ.

"మాది పీలేరు దెగ్గిర. ఈ వూరికి ఈ పొద్దే పద్దన్నే వచ్చినా. మా ఇంటాయన ఉజ్జోగానికి పోయిందాడు. వచ్చేలకు అన్నంకూర చెయ్యద్దా. కొళాయిలో వస్తాందే నీళ్ళు ఉప్పుకసింగినీ. ఆ నీళ్ళతో అన్నంకూర చేస్తే బాగ్గావు..తాగే నీళ్ళు యాడొస్తాయో చెప్పినావంటే తెచ్చుకుంటా" గలగలా చెప్పింది రాధ.

"మీరు చెప్పింది ఏమర్థం కాళ్లా..మంచినీళ్ళా..ఆ చివర ట్యాప్ ఉంది. అక్కడ వస్తాయి." చిరాగ్గా చెప్పి లోపలికి వెళ్ళిపోయింది అనసూయ.

ఆమెకెందుకు అంత చిరాకు వచ్చిందో అర్థం కాలేదు రాధకు. ఇంట్లోకి పోయి బిందె తీసుకుని, టవల్ భుజం మీద వేసుకుని కొళాయి వద్దకు వెళ్ళింది. అక్కడ ఎవ్వరూ లేరు. బిందెకు నీళ్ళు పట్టుకుంది. టవల్ చుట్ట చేసుకుని తలపైన పెట్టుకుంది. దానిపైన బిందెను పెట్టుకుని ఇంటికి రాసాగింది. చెప్పుల్లేని ఆమె పాదాలవైపు దారికిరువైపులా ఉన్న ఆడవాళ్ళు వింతగా చూస్తున్నారు.

ఎందుకందరూ తనను వింతగా చూస్తున్నారో రాధకు అర్థం కాలేదు. ఇంటిలో నీళ్ల బిందెను దించాక గుడ్డ సంచిని తీసుకుని కొళాయికి ఇవతల ఉన్న అంగడికి వెళ్ళింది.

కూరగాయలు తళతళలాడతా ఉండాయి.

"మటిక్కాయలు కాల్ కేజీ ఈన్నా" అంది.

"ఏంటీ.." అన్నాడు అంగడతను.

"మటిక్కాయలు కాల్‌కేజీ ఈ" అంది మళ్ళీ.

"లేవండీ.." అన్నాడతను.

"అద్దో..ఆడ వుండాయే" అంటూ చేయి చూపింది రాధ.

"ఓ..గోరు చిక్కుల్లా" నవ్వుతూ వాటిని తూకం వేసిచ్చి "ఇంకేం కావాలండీ" అన్నాడు.

"ఎర్రగడ్డలు అరకేజీఈ"

"ఏం గడ్డలూ..?!"

"ఎర్రగడ్డలు" చేయి చూపించి చెప్పింది రాధ.

"అవా..ఉల్లిపాయలు..ఏవూరమ్మా తల్లీ మీది?" అంటూ వాటిని అరకిలో తూకం వేసిచ్చాడు అతను.

"పీలేరు దెగ్గిర.." ఐదులిచ్చింది రాధ.

"అంత యాసగా ఉండాయేమండీ మాటలు..ఒక్కముక్కా అర్థం కావటంలేదు" అన్నాడు.

"అర్థం కాలేదా.." గొణిగినట్టుగా అని తప్పు చేసిన దానిలా తలొంచుకుని ఇంటిదారి పట్టింది రాధ.

అదే రోజు సాయంత్రం ఇరుగుపొరుగున ఉన్న ఆడవాళ్ళు ఐదారుమంది రాధ వాళ్ల ఇంటికి వచ్చారు. వాళ్లందరినీ చూడగానే రాధకు ఆనందమేసింది. తమ పల్లెలోలాగానే ఇక్కడ కూడా అందరూ బాగా ఒకరితో ఒకరు మాట్లాడుకుంటారేమో అనుకుంది.

ఉత్సాహంగా "రండి.. రండికా.." అంటూ అందరినీ ఆహ్వానించి గబగబా చాప తెచ్చి హాల్లో వేసింది.

ఇల్లంతా పరిశీలనగా చూస్తూ నిల్చున్నారంతా.

హాల్లో గోడకు పిల్లలతో కలిసి ఉన్న ఫోటో ఉంది.

"వాళ్ళిద్దరూ మా కూతుండ్లుకా.. ఊర్లో చదువుకుంటాండారు.. పెద్దమ్మి ఆరోతరగతి, చిన్నమ్మి మూడో తరగతి. ఆ పక్కనుండేది మా ఇంటాయన. ఇంగా చానా పోటోలుండాయి. అన్నీ వూర్లో ఉండాయి. ఈ సారి ఊరుకు పోయినప్పుడు తీసుకోనొస్తాలే. చూద్దురు. లోపల రూంలో చూద్దురు రాండి. బ్రహ్మంగారి పటం ఉండాది. మఠం పోయినప్పుడు తీసుకోనొచ్చినాం." అంటూ పడకగది వద్దకు తీసుకు పోయింది వాళ్లను.

లోపల మరో చాప, రెండు దిండ్లు, రెండు దుప్పట్లు ఉన్నాయి. గోడకు స్టాండు ఒకటి తగిలించారు. అందులో బ్రహ్మంగారి పటంతో పాటు వినాయకుడు, వెంకటేశ్వరుడు,లక్ష్మీదేవి, సరస్వతీదేవి ఉండే పటం కూడా ఉంది. ఓ మూల ట్రంకు పెట్టె, ఒక సూట్‌కేస్ ఉన్నాయి.

"డబుల్‌కాట్ లేదా?" అడిగిందొకామె.

అర్థంకానట్టు చూసింది ఆమె వైపు రాధ.

"మంచం లేదా..?" అదోరకంగా నవ్వుతూ అడిగింది మరొకావిడ.

"పల్లెలో నవారు మంచం ఉండాది. వూడక్కొయ్యలతో చేపించిండాం. చానా బాగుంటాది. ఈసారి పల్లెకు పోయినప్పుడు తెచ్చుకోవాల" అంది రాధ.

వంటగది దగ్గరకు వచ్చారందరూ.

"పంపు స్టవ్వుకా..మేలురకం అంట. మూడునూర్లు చెప్పినారంట. మా ఆయన గోజాడి గోజాడి ఇన్నూట యాభైకి తీసుకోనొచ్చినాడు. బాగుందాకా.." అడిగింది రాధ.

"చాలా బాగుంది. గ్యాస్ కన్నా తొందరగా అయిపోతాదిలే వంట" అందొకామె నవ్వుతూ.

అందరూ హాల్లోకి వచ్చారు.

"కుచ్చోండికా..కాఫీ పెడతా.." అంటూ వంటగదిలోకి పోబోయింది రాధ.

"వద్దు వద్దండీ..ఇంకోసారి వస్తాంలే..". ముసిముసిగా నవ్వుకుంటూ అందరూ వెళ్ళిపోయారు.

వాళ్లు ముసిముసిగా ఎందుకు నవ్వుకుంటూ పోయారో రోజులు గడిచే కొద్దీ రాధకు అర్థమవడం ప్రారంభమయింది.

పిల్లలు పట్టణం వచ్చినప్పుడు కూడా అలాంటి అనుభవాలే ఎదురయ్యాయి.

పల్లవి ఎనిమిదో తరగతి, రాధ ఐదో తరగతి చదువుతున్నాప్పుడు.

పిల్లలు వచ్చిన కొత్తల్లో ఒకరోజు సాయంకాలం స్కూలునుంచి ఇంటికి వచ్చారు ఇద్దరూ. ఇదు నిముషాలకంతా పక్కింటి అమ్మాయి వచ్చి "పల్లవీ.. మా అమ్మ పిలుస్తోంది రా" అంది.

పక్కింటి అమ్మాయి, పల్లవీ ఒకే తరగతి.

"ఏమంట" అంటూ పల్లవి పరుగున వెళ్ళింది అక్కడకు. వాణి కూడా అక్కను అనుసరించింది.

ఎందుకయి ఉంటుందా అనుకుంటూ రాధ ఇంటి ముందుకు వచ్చి వాళ్లనే గమనిస్తోంది.

ఇంటి గడప దగ్గర నిలబడుకోని ఉన్నామె వీళ్ళను చూడగానే "ఈ పొద్దు మీ ఇంట్లో ఏం కూర" అడిగింది నవ్వుతూ.

"గోసిపువ్వ కూర" అంది వెంటనే పల్లవి.

"ఏంకూరా.." మళ్ళీ అడిగింది ఆమె నవ్వును బిగబట్టుకుంటూ.

"గోసిపువ్వ కూరకా.." ఈసారి వాణి చెప్పింది.

ఆమె పకపకా నవ్వింది.

"వాణీ..పల్లవీ..రాండి" అరిచినట్టు పిలిచింది రాధ.

ఆమె ముఖం కోపంతో ఎర్రగా ఉంది.

"ఏంమా.." అంటూ వచ్చారిద్దరూ.

ఇద్దరినీ దబదబా బాదుతూ "నోర్మూసుకుని ఇంట్లో పడుండండి." అంది రాధ. ఆమెలో కోపం కన్నీళ్ల రూపంలో బయటకు వచ్చింది.

అమ్మ కళ్ళలో నీళ్ళు చూడగానే పిల్లలిద్దరిలో కంగారు మొదలయింది. తామేమన్నా అమ్మను నిలదీసి తప్పుచేశామా అనుకున్నారు. తల్లి కన్నీళ్ల వెనక కారణాలు ఏమిటా అని ఆలోచించడం మొదలు పెట్టారు.

పిల్లల ముందు తప్పు చేసిన దానిలా రాధ తలదించుకునే ఉంది. కన్నీళ్ళు కారుతూనే ఉన్నాయి. మాట్లాడ్డానికి గొంతు పెగలడం లేదు. •

*సాహిత్య నేత్రం త్రైమాస పత్రిక కథల పోటీలో బహుమతి పొందినకథ*

*జులై – సెప్టెంబర్ 2007*